నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

నాసిరకంగా ప్యాచ్ వర్క్



నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వారం రోజుల క్రితం ప్యాచ్ వర్క్‌ను చేపట్టారు. ఆ పనులను నాసిరకంగా చేపట్టడంతో వారం రోజులకే రోడ్డు మళ్లీ గుంతలమయంగా మారింది. తాడ్వాయి నుంచి ఎల్లారెడ్డి వెళ్లే రోడ్డు స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు కంకర వేసి అవసరమైన డాంబర్ మిలితం లేక పైపై పూతలతో నాసిరకంతో పనులు చేయడం వల్లే రోడ్డు వారం రోజులకే పాడైపోయిందని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పనులు చేపట్టే సమయంలో సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఆంతర్యమేమిటోనని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేపట్టిన నాసిరకం పనులు పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మరమ్మతు పనులు మళ్లీ చేయించాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు తాము అర్హులం కాదా..?



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

గత 25 సంవత్సరాలు నుంచి గుడిసెలు వేసుకుని కూలీ పనులు చేసుకొని జీవిస్తున్న తాము సమగ్ర కుటుంబ సర్వేకు అర్హులం కాదా అని పలువురు ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి హనుమాన్ దేవాలయం వెనుక గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పలువురు బాధితులు ఆదివారం నవతెలంగాణతో మాట్లాడారు. ఎవరు ఎప్పుడు గుడిసెలు తీసేయమంటే అప్పుడు తీసేస్తూ రాత్రి సమయంలో విషపురుగుల సంచారంతో భయాందోళనతో జీవిస్తున్నామని తెలిపారు. ఆధార్ కార్డులు సైతం మార్చుకున్నామని వివరించారు. తమ కుటుంబాల సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్లెన్న, సీమ, నవీన్, గంగామణి ఉన్నారు.



ప్రతిభను అభినందిస్తున్న సీఎం

యుద్ధ విద్యల్లో ప్రతిభ

- 12 గోల్డ్ మెడల్స్, 3 వెండి, ఒకటి కాంస్య పతకాలు ఆమె సొంతం
- ఆదర్శంగా నిలుస్తున్న పిట్లం క్రీడాకారిణి

నవతెలంగాణ-పిట్లం

యుద్ధ కళల్లో రాణించాలంటే ఎవరైనా ఒకటో, రెండో ఆటల్లో రాణించి ప్రావీణ్యం చూపిస్తారు. కానీ ఈ అమ్మాయి పేరుకు తగ్గట్టు ఎనిమిది యుద్ధ విద్యల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయిలో 12 గోల్డ్ మెడల్స్, 3 వెండి, ఒక కాంస్య పతకాలు సాధించి రికార్డ్ సృష్టించింది.

కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి చెందిన తక్కడ్‌పల్లి నర్సింగరావు, శ్యామల దంపతుల కూతురు 'ప్రతిభ' ప్రాథమిక విద్యను తన తండ్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రతిభ హై స్కూల్‌లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పూర్తిచేసింది. ఇంటర్మీడియట్ బోధన్, డిగ్రీ, ఎంబీఏ పట్టాలను రాష్ట్ర రాజధానిలో విద్యనభ్యసిస్తున్న తరుణంలో యుద్ధ విద్యల్లో రాణించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులకు తెలియకుండానే చదువుతోపాటు పార్ట్ టైం జాబ్ సంపాదించుకుని వచ్చే 10, 12వేల రూపాయలతో మొట్టమొదట కరాటే, కిక్ బాక్సింగ్ క్రీడల్లో తన మొదటి గురువు కృష్ణానాయక్ ప్రోత్సలంతో ప్రవేశించింది. తైక్వాండో, చెస్, బాక్సింగ్, వుషు, సిలంబం, కిక్ బాక్సింగ్, తైబాక్సింగ్, ఎంఎం, గ్రాఫ్లింగ్ యుద్ధ కళల్లో నైపుణ్యం సంపాదించింది. వెయిట్ లిఫ్టింగ్ నేర్చుకున్న అమ్మాయిలు సున్నితం. వాళ్లకి మార్షల్ ఆర్ట్స్ కష్టం అనే అభిప్రాయాన్ని అధిగమించడానికి రోజుకు 16 గంటలు కష్టపడుతూ వానొచ్చినా.. వరదొచ్చినా క్లాసులకు డుమ్మాలు కొట్టకుండా పోటీల్లో పాల్గొని కిక్ బాక్సింగ్ నేషనల్ మెడల్ దక్కించుకుంది. అదే కారణంలో తల్లిదండ్రులకు మొదట తెలిసి భయపడినప్పటికీ తరువాత ప్రోత్సహించారు. అలా మొదలైన కెరీర్‌తో నేపాల్, టర్కీ, ఇంగ్లాండ్, ఇటలీ, భూటాన్, అర్మేనియా, ఇండియన్ ఏషియన్ అంతర్జాతీయ క్రీడల్లో 7 మంది గురువుల సహాయ సహకారాలతో పలు పతకాలు కైవసం చేసుకొని ఆదర్శంగా నిలుస్తోంది.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి



అంతర్జాతీయంగా ఆరుదేశాలలో నిర్వహించిన యుద్ధ కళల్లో ప్రతిభ చాటి 12 బంగారు, మూడు వెండి, 1 కాంస్య పతకాలు సాధించాను. తనకు తెలంగాణ ప్రభుత్వం సర్టిఫైడ్ కోచ్‌గా గుర్తింపు సాధించినప్పటికీ ప్రభుత్వం ప్రోత్సహం అందించలేక పోవటం వల్ల చెస్ బాక్సింగ్ పోటీల కోసం టర్కీ, తైక్వాండో పోటీలకు యూకే వెళ్లాల్సి వస్తున్నందున మాకు స్తోమత సరిపోనందున నాన్న శిష్యులు కొందరు సహాయపడ్డారు. ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తే మరిన్ని విజయాలు సాధిస్తా. కోచ్‌గా నిలుస్తూ దేశానికి కీర్తి నందిస్తా.

– క్రీడాకారిణి ప్రతిభ



మాట్లాడుతున్న ఖాజా మొయినుద్దీన్

మతోన్మాద విద్వేష శక్తుల నుంచి

తెలంగాణను రక్షించుకుందాం

- మతసామరస్యాన్ని కాపాడుకుందాం
- వామపక్ష పార్టీల ఐక్య కార్యచరణ కమిటీ



సదస్సులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మతోన్మాద విద్వేశ శక్తుల నుంచి తెలంగాణను రక్షించుకుందామని, మతసామరస్యాన్ని కాపాడుకుందామని వామపక్ష పార్టీల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద, విద్వేష రాజకీయాలను వ్యతిరేకించాలని పిలుపునిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వామపక్ష పార్టీల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రామచందర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, లిబరేషన్ నాయకులు ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మతం పేరుతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీలపై, దళితులపై మైనారిటీలపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ దేశంలో పతనమవుతున్నదన్నారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. శాసనసభ ఎన్నికల తర్వాత తెలంగాణలో ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని వివరించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా అవకాశవాద వైఖరితో ఉంటున్నదని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విభజన రాజకీయాల ప్రమాదాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విస్మరిస్తున్నాయని అన్నారు. తెలంగాణలోని వామపక్ష పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయడానికి, మతసామరస్యాన్ని కాపాడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, లౌకికత్వం, సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఒకే తాటి మీదకు రావడానికి ప్రయత్నిస్తామన్నారు. తెలంగాణ గడ్డమీద మతోన్మాదానికి చోటు లేదని చాటి చెప్పాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజం మీద ఉందని వివరించారు. ఆ వైపుగా ప్రజలను మరింత చైతన్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సీపీఐ జిల్లా నాయకులు పెద్ది వెంకట్రాములు, సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, వామపక్ష పార్టీల నాయకులు దేవారం, సుధాకర్, నూర్జహాన్, వెంకటేష్, గంగాధర్, సాయన్న, సంధ్యారాణి, శ్రీధర్, గణేష్, విగ్నేష్, మురళి, రమేష్, కిషన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలో పరీక్షా కేంద్రాలను పరిశీలించిన నిజామాబాద్ ఇంచార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులకు గాను, 10,037 మంది హాజరు కాగా, 9904 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఉదయం సెషన్‌లో 50.33 శాతం హాజరు నమోదయ్యిందని అన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 9992 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 9949 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. సెకండ్ సెషన్‌లో 50.10 శాతం హాజరు నమోదయ్యిందని వివరించారు. సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే గ్రూప్-3 పరీక్షకు సంబంధించి కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులు నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయడం జరుగుతుందని, అనంతరం లోనికి అనుమతించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు.

గ్రూప్ 3 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఇంచార్జీ సీపీ..



కామారెడ్డి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

డిచ్‌పల్లి,కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన గ్రూప్ 3 రెండవ స్టేషన్స్ పరీక్ష నేపథ్యంలో నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సి.హెచ్. సింధూశర్మ ఐ.పి.యస్. ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ, ఎస్.ఆర్.డి.జి స్కూల్ ఉమెన్స్ కాలేజీ ఇతర పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల గురించి పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్, స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొత్తం 66 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ఈ పరీక్ష కొనసాగుతుందని, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) కోటేశ్వరరావు, డిచ్‌పల్లి సి.ఐ కె.మల్లేష్, డిచ్‌పల్లి ఎస్ఐ షరీఫ్ ఇతర సిబ్బంది విధినిర్వహణలో ఉన్నారు.

అమ్మ పరీక్ష హాలులో.. కుమారుడు బయట..



బాలుడిని ఎత్తుకున్న ఏఎస్ఐ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి సెయింట్‌పాల్ హైస్కూల్లో ఆదివారం జరుగుతున్న గ్రూప్-3 ఎగ్జామ్ రాయటానికి ఓ మహిళ ఆమె కుమారుడిని తీసుకొని ఎగ్జామ్ రాసేందుకు ఎగ్జామ్ సెంటర్‌కు వచ్చింది. ఆమె బంధువులెవరూ లేనందున బాబుని ఎగ్జామ్ హాల్‌లోనికి అనుమతించలేదు. అక్కడ డ్యూటీలో ఉన్న స్థానిక ఏఎస్ఐ సలీం బాబు తండ్రి వచ్చేవరకు అతని వద్దనే ఉంచుకున్నాడు. పోలీస్ సేవాభావానికి పరీక్ష రాయడానికి వచ్చిన పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-3 పరీక్షకు 40 శాతానికిపైగా అభ్యర్థుల గైర్హాజరు..

కామారెడ్డి : కామారెడ్డిలో 20 పరీక్ష కేంద్రాలలో జరిగిన గ్రూప్ -3 పరీక్షకు 40 శాతానికి పైగా అభ్యర్థులు హాజరు కాలేదు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం మొత్తం 8268 మంది అభ్యర్థులకు గాను ఉదయం 4655 మంది హాజరు కాగా, 3613 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన గ్రూప్-3 పరీక్షకు మొత్తం 8268 మంది అభ్యర్థులకు గాను 4644 మంది హాజరు కాగా, 3624 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ సింధు శర్మ ఉదయం పరిశీలించారు.



నిజామాబాద్‌సిటీ : అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను

ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దు

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్



మాట్లాడుతున్న జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తుందని వాటిని ఇవ్వద్దని ప్రభుత్వమే బోర్డ్ ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి రరూ.10లక్షలు, సహజ మరణానికి ఐదులక్షలు, ప్రసూతి, వివాహ ఖర్చులకు రూ.లక్ష ఇవ్వాలని, 2009లో నమోదు చేసుకున్న కార్డులను వెంటనే రెన్యువల్ చేయాలని అన్నారు. కొత్తగా నమోదు చేసుకోవాలనుకున్న కార్మికులకు కొత్త కార్డులను వెంటనే నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులకు అందరికీ ఇవ్వాలని, ప్రాజెక్టులు, రోడ్లు, పెద్ద పెద్ద కంపెనీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు, వలస కార్మికులకు అందరికీ స్పెషల్ డ్రైవ్ చేసి కార్మికులకు అందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలని, వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెంటర్లలో హెల్త్ చెకప్ పేరిట అక్రమ వసూళ్లు చేస్తున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని అన్నారు. తూతూ మంత్రంగా హెల్త్ చెకప్ చేస్తూ కార్మికులకు లేనిపోని రోగాలున్నాయని భయభ్రాంతులకు గురిచేస్తూ ఒక్కొక్క వ్యక్తి నుంచి 3500 గవర్నమెంట్ ద్వారా తీసుకుంటున్నారని ఇది అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ అనుమతితో ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న హెల్త్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజనర్సు, జిల్లా కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి సాయిబాబా, సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు రాజయ్య ప్రభు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న చెరువులు



మండలంలోని ఓ గ్రామంలో చెరువు(ఫైల్‌ఫోటో)

- తూముల నుంచి ఇష్టానుసారంగా నీటి విడుదల
- చెరువుల భూమి కబ్జాలకు గురి
- రెవెన్యూ శాఖ,ఇరిగేషన్ శాఖ సమన్వయ లోపం

నవతెలంగాణ-నిజాంసాగర్

వర్షాకాలం ప్రారంభం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ పూర్తిగా ఎండిపోయాయి. ఈసారి చెరువులు నిండవేమో అనుకున్న సమయంలోనే సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని చెరువులు, కుంటలు అన్ని పూర్తిస్థాయిలో నిండాయి. చెరువులు నిండాయని ఆనందంతో అన్నదాతలు ఈసారి కూడా ఖరీఫ్, యాసంగి పంటలకు ఎలాంటి ఢోకాలేదని ఆనంద వ్యక్తం చేశారు. కానీ ఆ ఆనందం రెండు నెలలు కూడా లేకుండా పోయింది. అందుకు కారణం మండలంలోని చెరువులన్నీ ఎండిపోవడమే.

వివరాల్లోకి వెళితే మండలంలోని పలు గ్రామాలలోని చెరువులు పూర్తిగా నవంబర్ నెలలోనే సగం ఎండిపోయాయి. అందుకు గల కారణం చెరువులను పట్టించుకునే వారే లేరని మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో చెరువులను కాపాడడానికి వీఆర్ఏలు ఉండేవారు. గతంలో ఈ చెరువుల బాధ్యత పూర్తిగా రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉండేది. మండలంలో ఇంచుమించుగా 90 మంది వీఆర్ఏలు పనిచేసేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారందరినీ వివిధ శాఖలలో పంపించడంతో పాటు వీఆర్ఏ వ్యవస్థను మొత్తం ఆపేసింది. ఆ చెరువుల బాధ్యత మొత్తాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్పగించారు. అప్పట్లో వీఆర్ఏల బాధ్యత పూర్తిగా చెరువులను కాపాడడమే. వీరు చెరువులలోని నీరును కాపాడుకుంటూ చెరువులో ఎన్ని నీళ్ల ఉన్నాయో చూసి ఆ నీళ్లకు సరిపడా పంటలు ఎక్కడ వరకు పండుతాయో చూసి ఆ నివేదికను మండల రెవెన్యూ అధికారికి వ్యవసాయ శాఖ అధికారులకు పంపేవారు. ఆ నివేదిక చూసిన మండల రెవెన్యూ అధికారి చెరువు దగ్గరకు వచ్చి పరిశీలించి దండోరా వేయించి అక్కడి వరకు మాత్రమే పంటలు వేయాలని ఆయన సూచనలు చేసి వెళ్లేవారు. అనంతరం గ్రామాలలో పనిచేసే వీఆర్ఏలు ఆ పంటకు అవసరమున్న నీళ్లను ఓ ప్రణాళిక బద్ధంగా వదిలేవారు. ఇప్పుడు వీఆర్ఏలు లేకపోవడంతో చెరువులోని నీరుని ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వదులుకుంటున్నారు. నీటిని వదిలిన తర్వాత ఆ తూమును కట్టేసేవారు లేకపోవడంతో చెరువులోని నీరు అన్ని వృథాగా పోతున్నాయనే ఆరోపణలు గ్రామాలలోని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులకు గ్రామాలలోని ప్రజలు తెలపడంతో ఇరిగేషన్ శాఖలో సరిపడేంత సిబ్బంది లేకపోవడంతో ఎన్ని చెరువులను చూసుకోవాలో అర్థం కాని పరిస్థితిలో వారు ఉన్నారు. దానితోపాటు చెరువు భూమిని కబ్జా చేస్తున్నారు. కబ్జా చేసిన భూమిని కాపాడాలంటూ రెవెన్యూ అధికారికి మండలంలోని కొంతమంది ప్రజలు అర్జీ పెట్టుకున్నా. ఇప్పుడు ఆ చెరువులు మా పరిధిలో లేవంటూ అధికారులు దాటేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులకు విన్నవించినా చెరువు విస్తీర్ణం సంబంధించిన పూర్తి వివరాలు రెవెన్యూ శాఖలోని ఉంటాయని వారు తెలుపుతున్నారని వారు అన్నారు. రెండు శాఖలకు విడివిడిగా దరఖాస్తులు ఇచ్చినా శాఖ సమన్వయ లోపంతో ఎవరు కూడా చెరువు దగ్గరికి వచ్చి పరిశీలించిందే లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మండలంలోని చెరువుల విస్తీర్ణం రోజురోజుకీ తగ్గడంతోపాటు సంవత్సరానికి రెండుసార్లు సాగయ్యే పంటలు ఒకేసారి సాగుచేసే వీలుంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులన్నీ త్వరగా ఎండిపోతే వేసవికాలంలో తీవ్రంగా నీటి సమస్య ఏర్పడక తప్పదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువులను కాపాడడానికి వెంటనే వీఆర్ఏలను నియమించాలని మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువుల భూమిని కాపాడడానికి ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో జాయింట్ సర్వే చేయించి చెరువు భూమిని ఎవరైతే కబ్జా చేశారో ఆ కబ్జా నుండి విడిపించి చెరువులను కాపాడాలని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు.

సెంటెన్స్ చర్చ్‌లో ఘనంగా బాలల దినోత్సవం



నవతెలంగాణ-కంఠేశ్వర్
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సుభాష్ నగర్ లోని సెయింట్ ఆన్స్ చర్చ్‌లో ఆదివారం రేవరెండ్ ఫాదర్ మాదాను జోసెఫ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఫాదర్ రొమాల్డో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులైన పిల్లలందరూ ఆటపాటలతో సంతోషంగా గడిపారు. వేషధారణలో చిన్నారులు చేసిన పాషన్ ప్లే అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు ఆలపించిన పాటలు అందర్నీ అలరించాయి. కార్యక్రమ నిర్వహణలో తోడ్పాటు అందించిన సిస్టర్ నిర్మల మరియు నిర్మల హృదయ సిస్టర్స్ అందరిని చర్చి సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ సిస్టర్లు, పారిష్ కౌన్సిల్ సభ్యులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్
మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ఎస్ఓ జి.వినోద శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో హెడ్ కుక్ పోస్టు కొరకు 10వ తరగతి, అసిస్టెంట్ కుక్ 7వ తరగతి, నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు పదోతరగతి పూర్తి చేసిన మహిళా అభ్యర్థినిలు అర్హులని తెలిపారు. స్థానిక మండల కేంద్రానికి చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని సూచించారు. ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు స్థానిక పాఠశాలలో సంప్రదించాలని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దొంగలకు అడ్డా.. బస్టాండ్, రైల్వేస్టేషన్

- పోలీసుల నిఘా కరువు
- రెచ్చిపోతున్న దొంగలు



నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు దొంగలకు అడ్డాలుగా మారాయి. పోలీసుల నిఘా వైఫల్యం దొంగలకు వరంగా మారాయి. దీంతో రెచ్చిపోతున్న దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దొంగతనాలను నియంత్రించేందుకు పోలీస్ శాఖతో పాటు ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వరుస దొంగతనాలకు కారణ మవుతున్నాయి. దొంగల ముఠాలలో మగవారితో పాటు మహిళలు కూడా ఉండడంతో సులువుగా ప్రయాణికులను దోచుకుంటున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో దొంగలున్నారు.. జాగ్రత్త అంటూ పోస్టర్లు వేయడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇక రాత్రుల్లో మాత్రం దొంగల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్నారు.

నిత్యం ఫిర్యాదులు అందుతున్న పోలీసులు మాత్రం కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నెల రోజులుగా ప్రయాణ ప్రాంగణాలలో దొంగల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. అయితే బస్టాండ్ రైల్వే స్టేషన్లలో చోరీలకు పాల్పడే వారి గురించి సంబంధిత పోలీసులకు తెలిసిన చర్యలు తీసుకోవడంలో మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చోరీలకు గురైన బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి దొంగల ఆచూకీ కనిపెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రుల్లో బస్టాండ్‌లోని పోలీస్ బూత్‌లో మాత్రం సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తుంది. ఒకరిద్దరు పోలీసులు ఉన్నప్పటికీ రాత్రుల్లో మాత్రం వారు దొంగలపై నిఘా పెట్టకుండా తమకేమీ పట్టనట్లుగా నిద్రవస్తాలో డ్యూటీని నిర్వహిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం పనిచేయడం లేదని పలువురు ప్రయాణికుల ద్వారా తెలిసింది. దీంతో దొంగల హడావిడి నిత్యం కనిపిస్తుంది. నిజామాబాద్ రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల నుండి ప్రతిరోజు వేల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. వీరిలో ఒంటరి మహిళలను, వయసు పైబడిన వారిని లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. చిరు దొంగలతో పాటు భారీ దొంగలు ముఠాల సైతం ఈ ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ప్రత్యేక పోలీస్ బృందాలు ప్రయాణ ప్రాంగణాలలో నిత్యం గస్తీ నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థానికంగా బూత్ సిబ్బంది దొంగలపై నిఘా ఏర్పాటు చేసి చోరీలను నియంత్రించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో దొంగలు అడ్డాలుగా చేసుకొని మరీ చోరీలకు పాల్పడుతున్నారు. రైలు కదుగుతున్న సమయంలో కిటికీ వద్ద కూర్చున్న వారి మెడలోంచి బంగారు గొలుసులు, సెల్ ఫోన్ ల ను లాక్కొని స్టేషన్ బయట ప్రాంతం నుంచి పారిపోతుంటారు. ప్రయాణికులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు నిలువు దోపిడికి గురి కావడం ఇక్కడ సర్వసాధారణం అయిపోయింది. చోరీలకు పాల్పడేవారు నిత్యం అదే ప్రాంతంలో సంచరిస్తున్న పోలీసులు వారిని గుర్తించకపోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ బస్టాండ్లలో డ్యూటీలు నిర్వహించే పోలీసులకు చేతివాటం ప్రదర్శించే దొంగలకు మధ్య సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి కనుసన్నల్లోనే దొంగతనాలు జరుగుతున్నట్లు గతంలో అనేక విమర్శలు వ్యక్తమైన ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రయాణ ప్రాంగణ దొంగలకు వరంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్లలో రాత్రివేళ ప్రయాణించాలంటే భయంతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ క్షణంలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తారో తెలియని దుస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో ప్రయాణికుల సెల్‌ఫోన్ దొంగతనాలు నిత్య కృత్యమయ్యాయి. బస్టాండ్‌లోని ప్లాట్ ఫాం వద్ద బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు ఏ మాత్రం ఆదమరిచి చాలు దొంగలు విలువైన వస్తువులను చోరీ చేయడం ప్రతిరోజు జరుగుతున్న సంఘటనలు. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణాలలో జరుగుతున్న చోరీలను నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన అఫ్తాబ్ కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యులు తమ సేవా సంస్థ ద్వారా ఆదివారం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అఫ్తాబ్‌కు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని, నిరుపేద కుటుంబం కావడం వల్ల చేసేది లేక వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించే దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హాండ్ సేవా సంస్థ సభ్యులు అఫ్తాబ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమకు తోచిన విధంగా రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ కో చైర్మన్‌లుగా ఎడ్ల నాగరాజు, అంగేరి ప్రదీప్




నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ కో చైర్మన్‌లుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎడ్ల నాగరాజు, అంగేరి ప్రదీప్‌ని నియమిం చారు. మాలమహానాడులో ఆవిర్భవిం చినపట్టినుంచి 27 సంవత్స రాలుగా జూపుడు ప్రభాకర్, పివి ప్రభాకర్‌తో కలిసి ఎడ్ల నాగరాజు పలు ఉద్యమాలలో పని చేశారు. స్టూడెంట్ యూనియన్ నాయకులుగా అంగేరి ప్రదీప్ పని చేస్తున్నారు. డిసెంబర్ 1న సింహగర్జన విజయవంతం చేయండి.

బీఎన్ఆర్‌కె ఎస్ జిల్లా 4వ మహాసభకు హాజరై జయప్రదం చేయండి

నవతెలంగాణ ఎల్లారెడ్డి
భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం కామారెడ్డి జిల్లా 4వ మహాసభకు కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ప్రచార కార్యదర్శి కుసులకంటి సాయిలు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నాడు నిర్వహించే మహాసభకు భవన నిర్మాణరంగ కార్మిక సంఘం వ్యవస్థాపకులు కమల ఐలన్న హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించి కార్మిక హక్కులను సాధించుకోవాలన్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణంగా కార్మికులు మర్లు సాయిబాబా, లక్ష్మణ్, రాజు, సాయిలు, చంద్రయ్య, కాంతారావు, బాలయ్య, అమృత్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డుపై బస్సులతో ట్రాఫిక్ అంతరాయం



నవతెలంగాణ ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రయాణికులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రోడ్డుపైనే బస్సులు ఎక్కాల్సి వస్తుంది. బస్సులు రోడ్డుపైన నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రోడ్డుపై నిలిచి ఉన్న బస్సులను ప్రయాణికులు ఎక్కుతున్న క్రమంలో ఇతర వాహనాలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడి ట్రాఫిక్ జామ్ కావడంతో స్థానికులు మండిపడ్డారు. సంబంధిత అధికారులు తుది దశలో ఉన్న బస్టాండ్ నిర్మాణ పనులను పూర్తి చేసి రోడ్డుపై బస్సులను నిలపకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏఆర్‌పి క్యాంప్‌లో కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి
గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న వారు. కంటి వైద్య పరీక్షలను తప్పకుండా నిర్వహించుకోవాలని, లైన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా ఆర్గనైజర్ సూర్య నారాయణ అన్నారు. మండలంలోని ఏఆర్ క్యాంప్ గ్రామంలో. లైన్స్ క్లబ్ ఆఫ్ ఏడపల్లి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు, గ్రామానికి చెందిన సుమారు 90 మంది వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు. 20 మందికి మోతి బిందు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు వారికి లయన్స్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. మిగతా వారికి ఉచితంగామందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో, లైన్స్ క్లబ్ ప్రతినిధులు గంగారెడ్డి, బంజ శంకర్, మనోజ్ కుమార్, కదం ప్రకాష్ రావు. స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

- పిసిసి అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్



మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్
కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని, ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని పిసిసి అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు చీకొట్టిన కేటీఆర్ కు అహంకారం తగ్గలేదని, ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను రెచ్చకొడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కేటీఆర్ సృష్టించే అపోహలు నమ్మవద్దు అని, ప్రజాస్వామ్యంలో నాయకులు మాట్లాడే భాషను బట్టి ప్రజల్లో గౌరవం పెరుగుతుందని, కాని ఆయన మాట్లాడే బాషా చుస్తే ప్రజలు అస్యహించుకుంటున్నారని తెలిపారు. కేటీఆర్ ముఖ్యమంత్రి, మంత్రులపై చేసిన వాఖ్యలను ఖండిస్తున్నానని, ఖబర్దార్ అని హెచ్చరించారు. అబద్దపు హామీలు కాంగ్రెస్ పార్టీవి కావని, బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్లుగా చేసినవి అబద్దపు హామీలు అని అన్నారు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారని, రైతులకు రుణమాఫీ, ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పది లక్షలకు పెంచామని, 500లకే సిలిండర్, 60000 ఉద్యోగాలు ఇంటిగ్రేటెడ్ స్కూలు, ఇంకా ఎన్నో హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. ముందు కేటీఆర్ తమ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు అబద్దమని ఆర్మూర్ సాక్షిగా నిరూపిస్తానని, ఆ తర్వాత దమ్ముంటే రేవంత్ రెడ్డి హామీలపై చర్చిద్దామని అన్నారు, కేటీఆర్ కుటుంబం అంత తెలంగాణాను దోచుకుందని, హరీష్ రావు పాల ను కూడ వదలలేదని, సంతోష్ రావు లండన్‌లో ఆస్తులు కొనుక్కున్నాడని, కవిత నైతే లిక్కర్ స్కామ్‌లో జైలుకు కుడా వెళ్లి వచ్చిందని విమర్శించారు. కాళేశ్వరం స్కామ్ ఎంత పెద్దదో అందరికి తెలిసిందని అన్నారు. బ్యారేజ్‌లు కుంగిపోయి బయటపెడ్డాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటుంది అని 100శాతం అమలు చేస్తుంది అని అన్నారు. ఎవరైనా సంక్షేమ పథకాలు లేక ఇతర పనులకు డబ్బులు వసూలు చేస్తే డిసిసికిచ గాంధీభవన్ లో పీసీసీ కి ఫిర్యాదు చేయాలని హితావు పలికారు. కార్యక్రమంలో పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్, పట్టణ అధ్యక్షులు ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ దూదిగాం ప్రమోద్, సీనియర్ నాయకులు అజ్జు, హబీబ్, పట్టణ ఉపాధ్యక్షులు బట్టు శంకర్, అబ్దుల్ ఫాయిమ్, ఏఎంసీ డైరెక్టర్ ఫయాజ్, ప్రధాన కార్యదర్శి షైక్ పాషా, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల కిషన్, నందు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బాల్కొండ
జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, ఆర్మూర్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి ఆదివారం మండల కేంద్రంలోని మహాకాళి మాత ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, ఆర్మూర్ మెజిస్ట్రేట్ వేముల దీప్తిలను బాల్కొండ మాజీ సర్పంచ్ బుస సునీత నరహరి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

లింబాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

కంఠేశ్వర్ : లింబాద్రి గుట్టపై గల లక్ష్మీనరసింహస్వామిని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాలా ఆదివారం దర్శించుకున్నారు. అదనపు న్యాయమూర్తి వేముల దీప్తితో కలిసి ఆలయంలో ఆమె పూజలు చేశారు. న్యాయమూర్తులకు అర్చకులు స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐ నవీన్ కుమార్, ఎస్సై మహేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ దరఖాస్తు సమస్యలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జేఈఈమెయిన్స్ దరఖాస్తు సమస్యలపై ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకోడానికి ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో ప్రకారం ఉంటేనే దరఖాస్తు అయితున్నాయన్నారు. కానీ మెమో ఆధార్ కార్డులో ఒక అక్షరం తేడా ఉన్న దరఖాస్తు కావడం లేదని, ఈ సమస్యని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి స్పందించి ఢిల్లీలో సంబంధిత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దాల నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నరేందర్, బిఆర్ఎస్ డబ్ల్యూ జిల్లా నాయకులు షాహిద్ , జిల్లా కార్యదర్శి, మండల అధ్యక్షులు ఎగ్గా క్రాంతి, ఖాలెద్, ఇర్షాద్, అబ్రార్, అజయ్, తాజ్, తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలి

- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్
పాలకవర్గాలు, ఉద్యోగులు, అధికారులు కలిసి సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం 71వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా సహకార సంస్థలను వ్యాపార అభివృద్ధి సంస్థలుగా మార్చడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందు తరాలకు అందించాలంటే అందరం కలిసి సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో కామన్ సర్వీసింగ్ సెంటర్ ద్వారా సంస్థను వ్యాపార రంగంలో ముందుకు తీసుకెళ్లకపోతే సంస్థ మనుగడకే ఇబ్బంది ఉంటుందని తెలిపారు. డీసీఎంఎస్ మనుగడ కొనసాగాలంటే ఎరువుల పంపిణీ ప్రారంభించాలని అదేవిధంగా డిసిసిబికి ఉన్న పని మాదిరిగాని మార్క్ఫెడ్, డిసిఎంఎస్‌లకు కలిపి అనుసంధానం చేసి మార్కెట్ చేసే పనులను డీసీఎంఎస్ ద్వారా కూడా చేయించాలని మార్క్ఫెడ్‌ను రాష్ట్రవ్యాప్తంగా డీసీఎంఎస్‌ను జిల్లా వ్యాప్తంగా కార్యాచరణ సూచించి డిసిఎంఎస్ మనుగడకు దోహదపడాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుకి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సహకార సంస్థల సీఈఓలు, చైర్మన్‌లు, డీసీఎంఎస్ ఉద్యోగులు, అధికారులు, పాల్గొన్నారు.

ఓం మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలం కేంద్రంలో ఓం మార్కండేయ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా టీవీఎస్ గంగాధర్, ఉపాధ్యక్షుడిగా భోగ సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గుంటుక ఆంజనేయులు, కార్యదర్శిగా గణపురం రాజేశ్వర్, క్యాషియర్‌గా కడగుంట్ల గణేష్ ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుండి వ్యాపారాల నిమిత్తం తరలివచ్చి ఇక్కడ నివాసాలు ఏర్పరచుకున్న పద్మశాలి కుల బాంధవులు పలువురు ఓం మార్కండేయ పద్మశాలి సంఘం పేరుతో కొత్త పద్మశాలి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సంఘం మొదటి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఓం మార్కండే పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యుల సమ్మతితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పాటైన సంఘ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న పద్మశాలి సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోతూ ధరణి కుమార్, అలిశెట్టి అజయ్, పోతూ అనిల్ కుమార్, ఎనుగందుల రాజేశ్వర్, భోగ వెంకటేష్, గురుడు లింబాద్రి, అడిచర్ల రవీందర్, అమృతం అనిల్, పోతు పృథ్వి కుమార్, పూజా గణేష్, కటకం వేణుగోపాల్, అంబాదాస్, తదితరులు పాల్గొన్నారు.

హార్ట్ సర్జరీ కోసం రూ.2.50 లక్షల ఎల్‌ఓసి అందజేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రానికి చెందిన కే.సౌందర్య గుండె ఆపరేషన్ కోసం బాల్కొం డ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రూ.2లక్షల 50వేల ఎల్ఓసిని మంజూరు చేయించారు. సౌందర్య గత కొంతకాలంగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతుంది. తల్లిదండ్రులను కోల్పోయి చికిత్స చేయించుకోవడానికి ఆమెకు ఎవరు ఆధారం లేని విషయం స్థానిక ప్రజా ప్రతినిధులు రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ కొరకు రూ.2లక్షల 50వేల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎల్ఓసి కాపీ ని సంబంధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ లో అందజేశారు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం



- ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-రెంజల్

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయన్న వివరాల ప్రకారం.. మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన శివ అనే యువకుడు రెంజల్ కమాన్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కాగా అతనిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-నిజాంసాగర్

మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో నూతన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంవత్సరం తిరగకముందే కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని కష్టకాలంలో కూడా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించబోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదర్‌రాజు, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్‌ఆలీ, పార్టీ మండల అధ్యక్షులు సాదుల సత్యనారాయణ, సోషల్ మీడియా మండల అధ్యక్షులు సాయగౌడ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఎడపల్లి : మంగళ్‌పాడ్‌లో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం





రెంజల్ మండలంలో సర్వే

సర్వేను వేగవంతం చేయాలి

- ఎన్యుమరేటర్లకు అధికారుల సూచన
- కొనసాగుతున్న సమగ్ర సర్వే

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్ : మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో పూర్తవుతుందని, ఈలోపు సర్వే వేగవంతం చేస్తూ పూర్తి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆశ్రిత, అంగన్వాడి సురేఖ, కారోబార్ ఎం.రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని మంగళ్‌పహడ్, కుర్నపల్లి, ఎడపల్లి, జానకంపేట్, ఏఆర్‌పి క్యాంప్, ఆయా గ్రామాలలో సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, ఎనిమినేటర్లు పాల్గొన్నారు.

లింగంపేట్ : గ్రామాల్లో కుటుంబ సమగ్ర ఆర్థిక కులగణన సర్వే ఆదివారం సైతం కొనసాగింది. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో సిబ్బంది సర్వే చేపడుతున్నారు. ఆదివారం నాటికి మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 75 శాతం సర్వే పూర్తయిందని మండల ఎంపీఓ మలహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారిగా సర్వే అధికారులకు సిబ్బందికి కుటుంబ సభ్యులు సహకరించాలని ఆయన సూచించారు. తప్పులు లేకుండా సర్వే నమోదు చేయాలని ఆయన సూచించారు.

సమగ్ర సర్వే 77 శాతం పూర్తి..

తాడ్వాయి : మండలంలో చేపడుతున్న కుల గణన సర్వే ఆదివారం వరకు 77 శాతం పూర్తయినట్టు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. మండలంలోని కృష్ణాజివాడి, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా 100 శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారితో పాటు సిబ్బంది ఉన్నారు.



తాడ్వాయిలో..

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-దోమకొండ

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ముత్యంపేట్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, పోలీస్‌లు కిరణ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ట్రాన్స్‌కో ఏఈ మోహన్

నవతెలంగాణ-జుక్కల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ తెలిపారు. 18-11-2024న ఉదయం 11:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జుక్కల్ సబ్ స్టేషన్ నుండి వెళ్ళే అన్నీ ఫీడర్స్ సింగిల్ ఫేజ్ మాత్రమే ఉంటుందని, కావున రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని కల్దుర్కి గ్రామంలో ఆదివారం బీరప్ప దేవాలయం మందిర నిర్మాణానికి కురుమ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప దేవాలయం నిర్మాణ కోసం సంభాజీ నీలకంఠ విజయ్ కుమార్ తన స్వంత స్థలాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కురుమ సంఘం యువకుడు సిరిగిరి మహేష్ డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడంతో ఆయనను సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు సిరిగిరి రామ్, సెక్రటరీ గౌరుగొండ, సిరిగిరి అశోక్, గ్రామ విడిసి చైర్మన్ గంగాధర్, కురుమ సంఘం మండల అధ్యక్షులు మేడి రవి, బోధన్ మండల గొర్రెల మేకల సహకార సంఘం అధ్యక్షులు దేవరావు, మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు




ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నేషనల్ లెవెల్ కరాటే కుంగ్ ఫు, తైక్వాండో ఛాంపియన్షిప్ ఆదివారం హైదరాబాదులో జరిగిన టోర్నమెంట్‌లో మహ్మద్‌నగర్ పాఠశాల నుంచి పాల్గొన్న ముగ్గురు విద్యార్థులు సిహెచ్.మహేశ్వరి, ఎం.గాయత్రి, ఎం.సోనీ గోల్డ్ మెడల్స్, ఎం.నందిని, బి.సింధు సిల్వర్ మెడల్స్ పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని క్రీడా రంగాల్లో ప్రతి ఆడపిల్ల ముందుండాలని ఆయన అన్నారు. కుంగ్ ఫు, కరాటే లాంటి యుద్ధ కళలను ప్రతి అమ్మాయి తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి, గడ్డం నాగార్జున తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏఐఎఫ్‌డిఎస్ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ శివకృష్ణ అధ్యక్షతన బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి, గడ్డం నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యిందన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని తెలిపారు. విద్యార్థి, యువత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రమైన కృషి చేసారన్నారు. ఎట్టకేలకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్ష సమావేశం నిర్వహించలేదని అన్నారు. కావున రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యారంగంపై సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాలోత్ జబ్బర్ నాయక్, శివకృష్ణ రాజు, పునీత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్గ రహిత సమాజ నిర్మాణమే సకల సమస్యలకు పరిష్కారం

- భారత జాతీయ మహిళా సమాఖ్య

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న పలువురు

వర్గ రహిత సమాజ నిర్మాణమే సకల సమస్యలకు పరిష్కారమని భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోనీ సిపిఐ జిల్లా కార్యాలయంలో భారత మహిళా సమైక్య కౌన్సిల్ సమావేశాన్ని కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు మంద రాజమణి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భారత మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు పుస్తెల సృజన హాజరై మాట్లాడుతూ సమాజంలో నేడు ప్రజాస్వామ్యం పేరుతో ధనస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగుతున్నతని తెలిపారు. ఈ వ్యవస్థను దశలవారీగా వర్గ పోరాటాల ద్వారా నిర్మూలించి మానవీయ సమాజాన్ని నిర్మించుకోవడానికి వర్గ పోరాటాలు తీవ్రతరం కావాలని అన్నారు. ప్రాంతాల తెగల, కులాల, వ్యక్తుల మధ్య అసమానతలను సృష్టిస్తూ ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ విద్వేషాలను రెచ్చగొడుతూ సమస్త ప్రజల శ్రమశక్తిని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. వర్గ, కుల సమాజాన్ని నిర్మూలించి వర్గరహిత సమాజం ఏర్పాటుకు వర్గ పోరాటాలతో సామాజిక న్యాయ పోరాటాలు ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఆసన్నమైందన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాలరాజు, మౌలాంబి, అంబటి, లక్ష్మి, గంగామణి, సుజాత, లక్ష్మి, మంద స్వరూప, దొకి లక్ష్మి, మేదర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా పశువుల తొట్టి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



అపరిశుభ్రంగా మారిన తొట్టి

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వెనక మిషన్ భగీరథ ట్యాంకు వద్ద పశువులు తాగే నీటి తొట్టి పూర్తిగా మురికి కాలువ వలె ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఆ తొట్టెలో నీరు ఉండి మొత్తం దోమలు దాని గుండా దోమలు వృద్ధి చెందాయని, దాని ముందే అంగన్వాడీ కేంద్రం ఉండడంతో చిన్నపిల్లలకు దోమల ద్వారా ఏదైనా రోగం వ్యాపిస్తే బాధ్యులు ఎవరని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి విష జ్వరాలు రాకముందే వెంటనే పరిసరాలను శుభ్రపరచాలని వారు కోరారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు..

- ఇవ్వడమే నా లక్ష్యం
- వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని



చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ నియోజకవర్గంలో తన ఊపిరి ఉన్నంత వరకూ ప్రతి పేదవాడికి నీడగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వర్ని మండలంలోని సేవాలాల్ తాండకు చెందిన డబుల్ బెడ్ రూమ్ కట్టుకున్న లబ్దిదారులకు బాన్సువాడ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11,500 ఇండ్లు పేదలకు కట్టిచ్చిన నియోజకవర్గం బాన్సువాడ అని గుర్తుచేశారు. పేదల కోసం తన రాజకీయాన్ని పణంగా పెడతానని అన్నారు.

నియోజకవర్గం ప్రజలకు కూడు, గూడు, విద్య, వైద్యం, వ్యవసాయం రైతులకు కావలసిన వసతులు, ఇలా అన్ని సమకూర్చినా అదే నాకు సంతృప్తినిస్తుందని వివరించారు. నా రాజకీయ జీవిత చరిత్రను ప్రజలకు అంకితం చేస్తానని పేర్కొన్నారు. ఎందరో రాజకీయ నాయకులు వస్తారు, పోతారని, కానీ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నింటిలో స్థిరాస్తుడని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ని నాయకులు వెలగపూడి గోపాల్, తారాచంద్, ఏఈ నాగేష్, గంగారాం పలు గ్రామాల ప్రజలు ఉన్నారు.

పలుచోట్ల ఘనంగా బోనాలు

నవతెలంగాణ-రెంజల్/లింగంపేట్



రెంజల్‌లో..

మండల కేంద్రంలో ముత్యాలమ్మ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలను ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ముత్యాలమ్మకు నైవేద్యాలు సమర్పించి తమ గ్రామం పాడిపంటలతో సస్యశ్యా మలంగా ఉండాలని కోరుతూ వారు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పోతరాజు మదన్, ప్రధాన కార్యదర్శి బోడిగా రవి, పోచయ్య, మాజీ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, జక్కులి అబ్బయ్య, జక్కుల సంతోష్, ఆనంద్ కుమార్, పోతురాజు ప్రభాకర్, మోహన్, కె.గంగాధర్, శరత్ కుమార్, సుధాకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు

లింగంపేట్ : మండలంలోని మెంగారం గ్రామంలో ఆదివాసీ నాయక పోడు ఆధ్వర్యంలో ఆదివారం బద్దిపోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా కార్తీక పౌర్ణమి సందర్భంగా బద్ది పోచమ్మకు బోనాలు పండుగ నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ నాయకపోడు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు అధ్యక్షులు పుట్ట దత్తులు, బాలు, పుట్ట రాములు, బాలసాయిలు, బాలపోచయ్య, నాయక్‌పోడు కులస్తులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో..

రోజంతా పనిచేసినా పూటగడవట్లే

- మోచి కులస్తులకు బతుకులు భారం
- దినమంతా ఎండలోనే పడిగాపులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో చెప్పులు కుట్టే మోచి కులస్తుల బతుకులు రోడ్లపైనే కొనసాగుతున్నాయి. గిరాకీ వస్తే పాత చెప్పులు కుడితే రూ.10 వస్తాయి.. లేదంటే దినమంతా ఎండలో గిరాకీ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. దినమంతా కూర్చుంటే ఎప్పుడో ఒకరోజు రూ.100 నుంచి 200 వరకు వస్తుందని మోచీ కులస్తులు అంటున్నారు. తక్కువ ఆదాయంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో ఒకచోట చిన్నపాటి దుకాణాలు వేసుకొని అక్కడే చెప్పులు కుట్టే వృత్తి చేసుకుందామంటే ఒకప్పుడు తమ దుకాణాలను తొలగించారని, ఇక మా బతుకులు రోడ్లపైనే పాత చెప్పులు కొట్టుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'దుకాణాల కోసం స్థలం ఇవ్వడం లేదు. వ్యాపారాలు చేద్దామంటే పెట్టుబడి లేక పాత చెప్పులు కుట్టే పనుల్లో నిమగ్నం కావలసిన దుస్థితి మా కుటుంబాలకు ఏర్పడింది.' అని చెబుతున్నారు. మాలాంటి నిరుపేద చేతివృత్తుల కోసం ప్రభుత్వం ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



గిరాకీ లేక పడిగాపులు కాస్తున్న మోచీలు

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్



మద్నూర్ : సీఎంతో ఎమ్మెల్యే, మంత్రులు

మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాందేడ్ విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాందేడ్ విమానాశ్రయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షేట్కార్ ఘన స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, జుక్కల్ ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువైపోయింది. గ్రామాల్లో ఎక్కడ చూసిన పదుల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్లి ప్రజలపై చిన్న పెద్ద తేడా లేకుండా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం పోచమ్మ ఆలయం వద్ద ఆడుకుంటున్న ఒక చిన్నారిపై కుక్క దాడి చేసి కలవడంతో ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ చిన్నారిని ఆర్మూర్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేస్తున్నారు. కుక్కల బెడదలతో బయటకు వెళ్లేందుకే ప్రజలు జంకుతున్నారు. పిల్లలు, పెద్దలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొందరు అంటుంటే, స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుక్కలను చంపించాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు.

108లో మెడికల్ టెక్నీషియన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108లో ఉద్యోగాల నియామకాల కోసం ఇంటర్వ్యూని నేడు, మంగళవారం, బుధవారం నిర్వయించనున్నట్టు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గాధం మధుకుమార్, జిల్లా కోర్డినేటర్ పెండ్యాల శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూ కొనసాగుతదని తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం బీఎస్సీ లైఫ్ సైన్స్ బీఫార్మసీ, డి ఫార్మసీల, జీఎన్ ఎండి ఎంఎల్ టి అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, జీరాక్స్ పత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు. వయస్సు 22 నుంచి 30 సంవత్సరాలు ఉండాలని, 9100799161, 807465225 ఈ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

19న ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 19 న జెడ్పిహెచ్ కల్లడి స్కూల్‌లో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్‌ను నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగమోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ఆదివారం తెలిపారు. ఈ ప్రక్రియలో ఎంపికైన క్రీడాకారులు 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు 2025 జనవరి 01 నుండి 2008 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 19న ఉదయం 10 గంటలకు జెడ్పిహెచ్ కల్లడి స్కూల్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. 9642535535, 9440441757 నెంబర్లకు సంప్రదించాలని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఐచర్ వాహనం దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామ శివారులోని లక్ష్మీ కెనాల్ పక్కన విద్యుత్ వైర్ల తాకిడితో ఐచర్ వాహనం ముందు భాగం పూర్తిగా దగ్ధం అయ్యింది. వివరాల్లోకి వెళ్తే ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గ్రామంలో నిల్వ ఉంచిన ధాన్యం సేకరణ కోసం ఐచర్ వాహనం వెహికల్ వెళ్తున్న క్రమంలో కొత్తపల్లి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుందని ఎస్ఐ రజినీకాంత్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే బాల్కొండ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ బి.శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ తయుబ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు అగ్నిమాపక లీడింగ్ ఫైర్ మెన్ టి.హరికృష్ణ, టి.సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సామాజిక కుల గణన సర్వేను స్వాగతిస్తున్నాం


మహిపాల్ మహారాజ్



నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సామాజిక కుల గణనకు డిఎస్పీ పార్టీ స్వాగతిస్తుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సామాజిక ముఖచిత్రం, తెలంగాణ సంపూర్ణ స్వరూపం ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సామాజిక కుల గణన ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సర్వే వివరణతోనే భారత రాజ్యాంగం ప్రకారం సబ్బండ వర్గాల సంపూర్ణ సామాజిక ప్రగతికి కావాల్సిన వాటిని సాధించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కేశవేణుకు సన్మానం



కేశవేణును సన్మానిస్తున్న సెపక్ తక్రా అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నుడా ఛైర్మన్, సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేశ వేణుని ఆయన నివాసంలో జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముమ్ముందు కేశవేణు మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో త్వరలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా సెపక్ తక్రా ఉపాధ్యక్షులు గడ్డం సతీష్‌రెడ్డి, ల్యాబ్ గంగారెడ్డి, లీగల్ అడ్వైజర్ నల్ల సుభాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో వెళ్తున్న యాదవసంఘం సభ్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మల్లన్న బోనాలు రెండవ రోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంకాలం మల్లన్న బోనాలు, పుట్ట బంగారు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిఐటియు పోరాట ఫలితమే

మధ్యాహ్న భోజన కార్మికులు విధుల్లోకి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిఐటియు పోరాట ఫలితంగానే తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను అధికారులు విధుల్లోకి తీసుకున్నారని నిజామాబాద్ జిల్లా సిఐటియు కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆర్మూర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వారం రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలో చేపట్టారు. అధికారులపై ఒత్తిడి తేవడంతో శనివారం అధికారులు స్థానిక ఆర్మూర్ ఎమ్మార్వో మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ, హెడ్మాస్టర్ చర్చించుకుని యూనియన్ నాయకులతో చర్చలు జరిపి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవటానికి అంగీకరించారని తెలిపారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నందున సిఐటియు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఏజెన్సీ కార్మికులపై ప్రధానోపాధ్యాయులు, అధికారులు వేధింపులను, కార్మికుల బకాయి బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్, ముత్యాల భోజన ఏజెన్సీ, కార్మిక నాయకులు సుజాత, సిఐటియు ఆర్మూర్ కార్యదర్శి ఎల్లయ్య మధ్యాహ్న భోజన, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుందాం

- తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల గణన విషయంలో కేంద్ర సర్కార్ ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని కోటగల్లీలోని నగర పద్మశాలి కళ్యాణ మండప పున్ణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నూడా చైర్మన్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి మండపాన్ని ప్రారంభించారు. అంతకుముందు మార్కండేయ మందిరంలో అనిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మండప భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. కుల జణన జరగకపోతే ప్రధానంగా నష్టపోయేది బీసీలే అన్నారు. అగ్రవర్ణాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వ్యతిరేకం కాదని కానీ బీసీలకు కూడా అంతే స్థాయిలో న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. చదువు, వ్యాపారం, రాజకీయపరంగా తీవ్రంగా నష్టపోతున్నామని గుర్తు చేశారు. కుల జనన చేస్తే కేవలం పద్మశాలీ కులస్తులు మాత్రమే లబ్ది పొందరని, సమాజంలో ఉన్న అన్ని కులాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు వెంకట నరసయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగందల మురళి, ఉపాధ్యక్షుడు వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

బీడీ కార్మికుల సంక్షేమం కోసం పోరాటం

- ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ .బాలరాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కార్యాలయంలో వై. ఓమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గోవర్ధన్, సుతారి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ కార్మికుల సంక్షేమం కోసం, సంస్థ రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నిరంతరం కృషిచేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమ నిర్వీర్యం చేయడానికి కార్పొరేట్ కంపెనీల సిగరెట్, గుట్కాలను ప్రోత్సహిస్తూ బీడీ పరిశ్రమ మీద దాదాపు 40శాతం పైన జీఎస్టీ వేస్తూ సంస్థని వీర్యానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. కార్మికులకు ఉపాధి తగ్గి వేతనాలు రాక, పెన్షన్ రాక అవస్థలు పడుతున్నారని అన్నారు. బీడీ కార్మికులకు నాసిరకమైన ఆకు, తంబాకు ఇచ్చే యజమానులు సరిపడా ఇవ్వకుండా కార్మికులను ఆర్థిక దోపిడీ, శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో బీడీ పరిశ్రమ రక్షణ కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా యూనియన్ ఇచ్చే పిలుపుల్లో కార్మికులు భాగస్వాములై కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎండి ముక్రం, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు, నాయకులు భానుచందర్, చక్రపాణి, హనుమాన్లు, రాధా కుమార్, మహేష్, అలీ, ఇమ్రాన్, కే.గంగాధర్, వివిధ మండలాల కార్మికులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

పలు శుభకార్యాలలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పలు ఫంక్షన్‌హాల్ యందు జరిగిన వివాహ శుభ కార్యాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మామిడిపల్లి మాజీ సర్పంచ్ మారుతి రెడ్డి, కొంతం మురళి, చిట్టి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామ సేవలు అందించాలి

- ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అశోక్



ఈఎన్‌టీ వైద్యులు చైతన్యను సన్మానిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజల ప్రాణాలను రక్షిస్తూ నిర్విరామ సేవలు అందించేది వైద్యులే అని ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అశోక్ అన్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను రక్షించే దేవుళ్ళుగా వైద్యులను కొలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ట్రెజరర్‌గా ఎన్నికైన నిత్య ఈఎన్‌టి వైద్యులు సిఎస్ చైతన్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట్ గౌడ్, భాను రామగిరి, తదితరులు పాల్గొన్నారు.

సదన్‌లో మెగా హెల్త్ క్యాంప్



హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలోగల మానవత సదన్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ఇందూర్ ఆధ్వర్యంలో 9 ఏళ్ల వయస్సు గల (54) మంది పిల్లలకు హెచ్‌విపి వ్యాక్సిన్ డాక్టర్ బండారు ఉషా అందజేశారు. గతంలో (36)మంది పిల్లలకు వ్యాక్సిన్‌ను అందజేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ రెండవ డోస్ జనవరి 2025లో ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారు ఉష మాట్లాడుతూ.. హెచ్‌విపి వ్యాక్సిన్ ద్వారా చాలా వరకు సర్వైకల్ కేసులను సులువుగా ఈ వ్యాక్సిన్‌తో కాపాడవచ్చని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ ప్రేమలత, అధ్యక్షులు మమత గుప్త, మిట్టల్, వైష్ణవి రాచకొండ కూడా ఈ వ్యాక్సిన్ సదన్ పిల్లలకు ఇవ్వడం గొప్ప ఆనందంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ హెల్త్ క్యాంప్ మానవతా సదన్‌లో నిర్వహించడానికి అవకాశం కల్పించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, జిల్లా సర్వశిక్షా అభియాన్ పథకం, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా మెడికల్ ఆఫీసర్ రాజశ్రీ, మానవత సదన్ లైజన్ అధికారి సుధాకర్ రావు, కేర్ టేకర్ అందె రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సదన్ పిల్లలకోసం కార్యక్రమాలు చేపడతామని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ హెల్త్ క్యాంప్‌లో మానవత సదన్ కేర్ టేకర్ అందే రమేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ నిజామాబాద్, ఇందూరు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సునీత జైన్, తేజస్విని కల, కవిత అగర్వాల్, సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి అరెస్టు చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలి

- లంబాడి హక్కుల పోరాట సమితి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంల్లో అర్ధరాత్రి అరెస్టు చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ..ఫార్మా కంపెనీల పేరుతో లంబాడి భూములను తీసుకోవడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ ప్రాంతం నుండి ఫార్మా కంపెనీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్ల , రోటి బండ తండా, పులిచెర్లకుంట తండా, గడ్డమీది తండా, మైసమ్మ గడ్డ తండా, ఈదుల కుంట తండా, హకీంపేట, పోలేపల్లి, ఈదులపల్లి తదితర గ్రామాలకు సంబంధించిన రైతుల భూములను ఫార్మా కంపెనీల పేరుతో లాక్కునేందుకు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కాడ అధికారి, స్థానిక తహసీల్దార్‌తో జరిగిన సమావేశంలో అధికారులపై జరిగిన దాడిని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తూనే ఈ దాడికి గల కారణాలను చూస్తే కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతానికి సంబంధించిన రైతులు, (లంబాడీ) గిరిజనులు తమ పొట్ట కొట్ట వద్దు.. మా భూములు మాకే కావాలి.. మా భూములు లాక్కోవద్దు.. అని ఎన్నిసార్లు ప్రాధేయపడినా డ్రోన్ కెమెరాలతో సర్వేలు చేస్తూ వేరే గ్రామాలకు సంబంధించిన ప్రజలను తీసుకొచ్చి ప్రజాభిప్రాయ సేకరణ పేరుమీద భూములను లాక్కోవాలని ప్రయత్నం చేస్తున్నారని అక్కడి రైతులు అగ్రహించారన్నారు. అధికారులపై జరిగిన దాడి ప్రభుత్వ వైఫల్యమేనని, ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో లంబాడి భూములను లాక్కొని ఫార్మా కంపెనీలకు ధారాదత్తం చేయడానికి భూములు ఎవరికి ఇవ్వబోమని ఎంత చెప్పినా పట్టించుకోకపోవడంతో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మా భూములు ఫార్మ కంపెనీలకు ఇవ్వం, ఈ ఫార్మా కంపెనీలు మాకు వద్దు అని అన్న రైతులను అర్ధరాత్రి అరెస్టులు చేస్తారా.. అని ప్రశ్నించారు. అధికారులపై దాడులు చేశారనే పేరు మీద 40 మందికిపైగా రైతులను, గిరిజన యువకులను మూకుమ్మడిగా అర్ధరాత్రి అరెస్టు చేశారని తెలిపారు. ఈ అరెస్టును ఎల్‌హెచ్‌పి ఎస్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని, అరెస్టు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీని నుండి వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ఉష రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ, స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉష రాష్ట్ర స్థాయి క్రీడా ముగింపు పోటీల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఒకరోజు ఉష రాష్ట్ర స్థాయి' క్రీడా పోటీలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడలను విజయవంతం చేసినందుకు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్, అంజయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, బీజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్, ఏలేటి గంగారెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్, మల్లేష్ గౌడ్, టి.సాయన్న, సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, జోగు నర్సయ్య, సంజీవ్ థామస్, యువజన సంఘం నాయకులు మధుకర్, సాయిలు, గంగారాజ్, హరీష్, ముస్కు శ్రీను, నవీన్ పాల్గొన్నారు..



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన జుంగల లావణ్య, రేండ్ల భాను, అవారి సుభాష్ వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్నారు. వైద్యం కోసం అయిన ఖర్చుల వివరాలను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి తెలిపారు. బాధితులకు రూ.1లక్ష 7 వేలు మంజూరయ్యాయి. ఆదివారం చెక్కులను కాంగ్రెస్ నాయకులు వారి ఇంటివద్దకు వెళ్ళి అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, కిసాన్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముస్కు మోహన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవం కప్ విజేత కమ్మర్‌పల్లి



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇషా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవం 2024 కప్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా కమ్మర్ పల్లి జట్టు నిలిచింది. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కమ్మర్ పల్లి వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 29న హైదరాబాద్‌లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవం కప్ పోటీల్లో జిల్లా తరపున కమ్మర్‌పల్లి టీమ్ పాల్గొంటుందని కోచ్ ఊట్నూరి చైతన్య తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన కమ్మర్ పల్లి జట్టు సభ్యులకు టోర్నమెంట్ నిర్వాహకులు కప్పుతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

ఫైనల్‌కు చేరాక.. తిరస్కరణ

- **ఆఫీసర్స్ క్లబ్ నిర్వహించిన టోర్నమెంట్‌లో గుల్బర్గా వాసులకు చేదు అనుభవం**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ప్రాంతంలో గల ఆఫీసర్స్ క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఈనెల 16, 17న నిర్వహించారు. ఇందులో భాగంగా 35, 40, 45, 50, 55, 60, 65, 70 సంవత్సరాల వయసు గల వారికి టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు అందుకు ఈనెల 15 లోపు ఎంట్రీ ఫీజుగా రూ.1000 చెల్లించి క్రీడలోకి అనుమతించారు. అందులో భాగంగా ఈ క్రీడల్లో గుల్బర్గా ప్రాంతానికి చెందిన హబీబ్, జాక్రియా అనే క్రీడాకారులు క్రీడల్లో పాల్గొని క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్, నాలుగు స్థానాలలో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నారు. తీరా.. క్రీడాలు నిర్వహించే ఆర్గనైజర్లు 'మీరు ఎక్కడి ప్రాంతానికి చెందినవారు..?, మీరు ఈ ఆటలో ఎలా ఆడుతున్నారు..? మిమ్మల్ని డిస్క్వాలిఫై చేస్తున్నాం, మీరు ఆడటానికి వీలులేదు.' అని హెచ్చరించడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ మీడియాకు వివరాలు వెల్లడించారు. 'ఆట ఆడటానికి ముందే, ఎంట్రీ ఫీజు తీసుకొని సమయంలోనే, మీరు ఏ ప్రాంతం వారు?, ఇక్కడ మీకు ఆడటానికి అవకాశాలు ఉన్నాయా...? లేవా అని ముందుగానే తెలిపి ఉంటే తాము ఇంతవరకు ఆట ఆడే అవకాశమే ఉండేది కాదు. అంతేకాకుండా తాము రెండు రోజులుగా ఇక్కడికి వచ్చి ఆటలు ఆడేవారిమి కాదు. ఫైనల్‌కు చేరుకున్నాక నిబంధనలు విధించడం ఎంతవరకు సమంజసం.' అని బాధితులు వాపోయారు. తెలంగాణ స్టేట్ ఓపెన్ మాస్టర్స్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ నిర్వహించే ఆర్గనైజర్లు ఈ అంశాలను ముందుగానే ఎందుకు పరిగణించలేదు. పరిగణించే క్రీడాకారులను తీసుకోవాలని పలువురు క్రీడాకారులు అంటున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

ఆట ఆడే సమయానికి ముందే క్రీడాకారులను ఏ విధంగా ఎంపిక చేయాలి, వారిని ఎలా పరిగణలోకి తీసుకోవాలనే అంశాలను ముందుగానే చర్చించి, ఎంట్రీ ఫీజు తీసుకునే సమయంలో ఆధార్ కార్డు ఇతర ఇతర సమాచారాన్ని ముందుగానే సేకరిస్తారు. ఇంతటి సమస్యకు దారి తీయడానికి కారణమేంటనేది ఆఫీసర్స్ క్లబ్‌కు చెందిన పలువురు సభ్యులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్గనైజర్ నిర్వాహకులు టోర్నమెంట్‌ను నిర్వహించే ముందు నియమ నిబంధనలు క్రీడాకారులకు స్పష్టంగా వివరించి పోటీల్లో పాల్గొనేలా చూడాలని పలువురు క్రీడాకారులు అంటున్నారు.



గ్రూప్-3 ప్రశాంతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గ్రూప్ 3 పరీక్ష ఆదివారం నిర్వహించారు. అభ్యర్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అభ్యర్థులు తమకు తోడుగా తల్లిదండ్రులు, భర్తలు, అన్నదమ్ములతో వచ్చారు. చిన్నపిల్లలున్న అభ్యర్థులు తమ పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పి పరీక్ష కేంద్రం లోనికి వెళ్లారు. ఇదిలా ఉండగా.. కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన పలువురు వెనుదిరిగి వెళ్లిపోయారు.



హాల్‌టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న అభ్యర్థులు



అమ్మ పరీక్షకు తోడుగా మరొకరు





పరీక్షకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి



ఆలస్యంగా వచ్చి.. వెనుదిరిగి..





పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు



సమయం ముగియడంతో గేట్ మూసివేస్తున్న అధికారులు

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

- **పరిశీలిస్తున్న ఎంపిడిఓ : బాలకృష్ణ**

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలో ఇంటింటి సర్వే కొనసాగుతున్నట్లు ఎంపిడిఓ బాలకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని మైలారం, దమ్మన్నపేట, రామడుగు గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేలో అధికారులు విధానాలను అయన పరిశీలించారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

- **సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్**



నవతెలంగాణ-ధర్పల్లి

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కే.ఎస్. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని రేకులపల్లిని భజన మండలి స్థాయి నుంచి సేవా సమితిగా ఆప్ గ్రేడ్ చేసిన శుభ సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సూచించిన సత్య ధర్మ, శాంతి, ప్రేమ, అహింస మార్గాల్లో నడవాలని ఆయన సూచించారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు సేవలు అందించడం గ్రామస్థాయిలో నిర్వహించే సేవలను విస్తృతం చేసేందుకు గ్రామాల్లో భజన మండలాలు, సేవాసమితిలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా, మండల స్థాయిలో వివిధ శాఖల బాధ్యులు, ప్రతినిధులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో భీంగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు సిహెచ్.గంగాధర్ (6 వార్డు), బోర్ లింగం(2వ వార్డు), గ్రామ కమిటీ అధ్యక్షుడు చెవ్వ అశోక్, సొసైటీ డైరెక్టర్ దశగౌడ్, మాజీ సర్పంచ్ బాలగంగాధర్, అక్రమ్, ఇక్రమ్, కో ఆప్షన్ మెంబర్ అహ్మదుల్లా తదితరులు కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రభాత్ పెరి కార్తీకమాసం ముగింపు ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో కార్తీకమాసం ప్రభాత్ ఫేరి ముగింపు ఉత్సవ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ వ్రతం చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ ముగింపు ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : మండలంలోని మంగ ల్‌పాడ్ గ్రామానికి చెందిన పోతు గంటి అనిత, నవదీప్‌గౌడ్, ఇల్లెందుల రవీందర్ గౌడ్‌కు సీఎం సహాయనిధి చెక్కులు ఆదివారం అందజేశారు. కార్యక్రమం లో తాజా మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు చేపూర్ శ్రీనివాస్‌గౌడ్, దేగమ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న పలువురు

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు గ్రామ అధ్యక్షుడు సాయగౌడ్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అంతిలక్ష్మి, పోసి కిరణ్, పరమేశ్వరి గారి రమేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రాగూర్, మైనార్టీ గ్రామ అధ్యక్షుడు షకీల్, నాయకులు హనుమాన్లు, వెంకటి, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి తెలిపారు. మండలంలోని కన్కల్, ఎర్రపాడు గ్రామాలకు చెందిన బాధితులకు చెక్కులను పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి షౌకత్ అలీ, యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, లక్ష్మణచారి, శివాజీ, వెంకట్రాంరెడ్డి, మల్లేష్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, ఎర్రవటి శ్రీకాంత్, మేకల రాజు, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రావు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.